క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

కర్నూలు: ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్నప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందాడు. శుక్రవారం అర్ధరాత్రి 44వ జాతీయ రహదారిపై ఉలిందకొండ ఫ్లై ఓవర్ పక్కన చోటుచేసుకుంది. అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రం మండలం అమ్మవారిపేటకు చెందిన ఆంజనేయులు(49) కళ్యాణదుర్గం డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి కళ్యాణదుర్గం నుంచి శ్రీశైలానికి 54 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు బయలుదేరింది. బస్సులో ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. ఆంజనేయులు బస్సును నడుపుతూ.. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఉలిందకొండ ఫ్లై ఓవర్ పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో ఆర్టీసీ బస్సు ముందు భాగం మొత్తం నుజ్జునుజ్జయింది. డ్రైవర్ ఆంజనేయులు తీవ్ర గాయాలకు గురికావడంతో 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా కోలుకోలేక మృతిచెందాడు.

బుక్కరాయసముద్రం: కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అమ్మవారిపేట వాసి, కళ్యాణదుర్గం డిపో డ్రైవర్ ఆంజనేయులు మృతి చెందిన సంగతి తెలిసిందే. శనివారం ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల గ్రామానికి వచ్చి డ్రైవర్ ఆంజనేయులు భార్య రాజేశ్వరికి రూ.15 వేలు అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందేలా చూస్తామన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



రంగవల్లులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, చైర్‌పర్సన్ భవాని, వీసీ నైరుతి



మొదటి స్థానంలో నిలిచిన వర్షాకార్యాకు బంగారు గొలుసును అందిస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్

గుంతకల్లుటౌన్: పట్టణంలో జగనన్న సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. యువతులు, మహిళలు వేసిన రంగవల్లులతో ఊరు–వాడా మురిసిపోయింది. జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, మాజీ చైర్మన్ రామలింగప్ప దంపతుల ఆధ్వర్యంలో మెప్మా విభాగం సహకారంతో శనివారం స్థానిక సరస్వతీ విద్యామందిరం రోడ్డులో ముత్యాల ముగ్గుల ఫైనల్ పోటీలు వర్ణశోభితంగా సాగాయి. 113 మంది మహిళలు పాల్గొని వేసిన రంగురంగుల ముగ్గులు ముచ్చట గొలిపాయి. విజేతగా నిలిచిన మండీబజార్‌కు చెందిన వర్షాకార్యాకు ఒక తులం బంగారు గొలుసు, రెండోస్థానంలో నిలిచిన 16వ వార్డుకు చెందిన సుజాతకు వాషింగ్ మిషన్, తృతీయస్థానంలో నిలిచిన 11వ వార్డుకు చెందిన అరుణకు ఫ్రిడ్జ్‌ను ఎమ్మెల్యే, చైర్‌పర్సన్‌లు అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్నవారందరికీ విలువైన బహుమతులను అందజేశారు.

ముత్యాల ముగ్గులు సృజనాత్మకతకు చిహ్నాలు

స్త్రీల సృజనాత్మకత, కల్పనాశక్తికి ముగ్గులు చిహ్నాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అన్నారు. రెండేళ్లుగా పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ దంపతులు, మెప్మా అధికారులు, ఆర్పీలను ఎమ్మెల్యే అభినందించారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగనన్నకు అక్కచెల్లెమ్మలంతా మరోసారి చల్లని దీవెనలందించాలని కోరారు. వైస్‌చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, కమిషనర్ మల్లికార్జున, పార్టీ యువనేత మంజునాథరెడ్డి, వార్డు కౌన్సిలర్ ఎస్.రంగమ్మ, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, సీఎంఎం భవానీ, మాజీ చైర్మన్ రామాంజినేయులు, మాజీ వైస్ చైర్మన్ గోపాజగదీష్, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, ఆర్యవైశ్యమహిళా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

పుట్లూరు: మండలంలోని ఏ.కొండాపురంలో మద్యాన్ని విక్రయిస్తున్న ఓబుళనాయుడు అనే వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. అతని నుంచి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

గుత్తి రూరల్: ఊటకల్లు గ్రామంలో మద్యం విక్రయిస్తుండగా గొల్ల శేషన్న అనే వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 15 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు.

జూదరుల అరెస్ట్

యల్లనూరు: చింతకాయమంద గ్రామ సమీపాన చిత్రావతి నది వద్ద శనివారం పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.2,550 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు.

సమస్యలు సృష్టిస్తే ఉపేక్షించం

పెద్దపప్పూరు: ఆధిపత్యం కోసం ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో సమస్యలు సృష్టించాలని చూస్తే ఎంతటి వారైనా ఉపేక్షించమని తాడిపత్రి డీఎస్పీ గంగయ్య హెచ్చరించారు. శనివారం సమస్యాత్మక గ్రామాలైన వరదాయపల్లి, నరసాపురంలో ఆయన పర్యటించి ఇరువర్గాల వారితో సమావేశం నిర్వహించారు.

'టీడీపీ నేతల మాయ మాటలు నమ్మొద్దు'

పెద్దవడుగూరు : నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని టీడీపీ నాయకుల చెబుతున్న మాయమాటలు నమ్మొద్దని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషారెడ్డి, జిల్లా బీసీ విభాగం కార్యదర్శి పాశం రంగస్వామియాదవ్ శనివారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎక్కడా అభివృద్ధి జరగలేదని, ఎక్కడా రోడ్లు వేయలేదని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని విమర్శించడాన్ని తప్పుబట్టారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చిట్టూరు వద్ద పెన్నానది పై రూ.3 కోట్ల కు పైగా నిధులు వెచ్చించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టామన్నారు. మండలంలో చాలా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగాయయని, ఈ విషయాన్ని టీడీపీ నాయకులు గమనించాలన్నారు. మండలంలోని రైతులకు పంట నష్ట పరిహారం రూ.73 కోట్లు పరిహారం అందించామని గుర్తు చేశారు. మండల ఉపాధ్యక్షుడు కాశేపల్లి రామాంజులరెడ్డి, నాయకులు ప్రకాష్‌రెడ్డి, నాగరాజు, సుంకన్న, దిమ్మగుడి మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, నందకుమార్‌రెడ్డి, కండ్లగూడూరు సూర్యనారాయరెడ్డి, బాలచంద్రారెడ్డి, హంపిరెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..ప్యాపిలికి చెందిన ప్రశాంత్ బైక్‌పై గుత్తి ఆర్‌ఎస్‌కు వచ్చాడు. తిరిగి ప్యాలికి వెళుతుండగా ఆసుపత్రి వద్ద ముందు వెళుతున్న ఆటోను ఢీ కొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బహిరంగ ప్రకటన

అనంతపురము జిల్లా పెద్దపప్పూరు మండలం ఎ.పప్పూరు గ్రామంలోని శ్రీ అశ్వర్థనారాయణ, భీమలింగేశ్వరస్వామి దేవస్థానమునకు సంబంధించి 2024 సం॥ మాఘమాసం తిరునాళ్ల సందర్భంగా(1) విద్యుత్ దీపాలంకరణ (2) పుష్పాలంకారము చేయుట (3) చలువపందిల్లు వేయుట (4) ఉత్సవ విగ్రహములు అలంకారము చేయుట (5) సిబ్బందికి భోజన సదుపాయం ఏర్పాటు చేయుట (6) పరిశుభ్రతా పనులు చేయుటకు (7) సున్నంపూతలు, డిస్టెంబర్ వేయుటకు (8) ప్రింటింగ్ (9) కిరాణా సరుకులు కొనుటకు సంబంధించి అర్హులైన వారి నుండి 18-01-2024వ తేదీ లోపల సీల్డు కొటేషన్సు కోరడమైనది. కొటేషన్స్ కొరకు మిగిలిన వివరాలకు దేవస్థానము కార్యాలయము వద్ద సంప్రదించగలరు.

ఇట్లు: **కార్యనిర్వహణాధికారి, సెల్ : 9959861168**

అభివృద్ధి పథంలో తాడిపత్రి

తాడిపత్రి: అభివృద్ధి పథంలో తాడిపత్రి దూసుకుపోతోంది. విద్య, వైద్య, వ్యాపార రంగాలతోపాటు మరిన్ని రంగాల్లో దినదినాభివృద్ధిని సాధించడంతో పాటు దేశంలోనే ప్రత్యేక గుర్తింపును చాటుకుంది. ఏపీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేపట్టిన నాటి నుంచి సాగిస్తున్న సంక్షేమ పాలన మూలంగానే గత 40 ఏళ్లలో తాడిపత్రి నియోజకవర్గాన్ని పాలించిన నాయకులు సాధించలేని ఘనతను సాధించింది. దాదాపు నాలుగున్నరేళ్లలోనే తాడిపత్రి అభివృద్ధి పథంలో ఇంతలా దూసుకుపోయేందుకు కారణం ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకుంటూ వాటిని అమలు చేస్తున్న సాహసోపేత నిర్ణయాలు. ప్రభుత్వం తీసుకుంటున్న అనేక చర్యలతో అన్ని రకాల వర్గాల వారు ఆర్థిక ప్రగతిని సాధిస్తున్నారు. గతంలో రియల్ ఎస్టేట్‌తో అనేక రంగాలు కుదేలయ్యాయి. ఆసుపత్రులు లేక జిల్లా కేంద్రాలకు రోగులను తరలించాల్సిన పరిస్థితులుండేవి. చదువు కోసం పిల్లలను ఇతర ప్రాంతాలకు పంపాల్సి వచ్చేది. వీటన్నిటికి చెక్ పెడుతూ ప్రభుత్వం నాడు నేడు కార్యక్రమం ద్వారా అనేక సంస్కరణలకు కార్యరూపం ఇచ్చి, తాడిపత్రికి వాటిన్నింటినీ ఏర్పాటు చేయడంతో తాడిపత్రి అభివృద్ధిని చూసి, ఇతర ప్రాంతాల ప్రజలు ఇక్కడకు వచ్చి స్థిరపడుతున్నారు. దీంతో రియల్ ఎస్టేట్ రంగం వేగం పుంజుకుంటోంది. తాడిపత్రి సరిహద్దు మూడు జిల్లాల సరిహద్దు కావడంతో ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణాత్మక నిర్ణయాల మూలంగా వేగంగా అభివృద్ధి చెందుతూ.. జిల్లాలో మరింత ఎత్తుకు ఎదుగుతోంది.

అభివృద్ధి పనుల కోసం రూ.కోట్ల వెచ్చింపు...

గత పాలకుల హయాంలో దాదాపు 40 సంవత్సరాలు ప్రజలు అన్నిరకాలుగా వెనుకబడిపోయారు. తాడిపత్రి ప్రాంతం అభివృద్ధికి దూరమైంది. అయితే 2019 లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక తాడిపత్రి అభివృద్ధికి నడుంబిగించింది. ఇందులో భాగంగా కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేస్తూ తాడిపత్రిని అభివృద్ధిలో ప్రభుత్వం ముందుకు తీసుకువెళుతోందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. 2019 నేటి వరకు నియోజవర్గవ్యాప్తంగా పలు రకాల అభివృద్ధి పనులు కోసం రూ.11,658.38 కోట్లు ఖర్చు చేశారు. ప్రజలకు పారదర్శక పాలనను అందించడంలో భాగంగా గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ సెంటర్లు , అంగన్‌వాడీ భవనాలు, సీసీ, బీటీ రోడ్లు, డ్రెయిన్లు, డిజిటల్ లైబ్రరీలు, కమర్షియల్ బిల్డింగులు, వంద పడకల ఆసుపత్రి భవనం, తాగు, సాగు నీటి పథకాలతో పాటు ఇతర ప్రజా సేవల కోసం కోట్లాది రుపాయలను వెచ్చించారు. మన బడి నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారాయి. పాఠశాల గదులు ఆధునీకరణ, అదనపు తరగతుల నిర్మాణాలు, ప్రహరీల ఏర్పాటు వంటి వాటితో పాటు శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులను వెచ్చించారు. విద్యుత్, తాగునీటి పథకాల తదితర పనులతో ప్రజలకు తాడిపత్రిలో గతమెన్నడూ చూడని అభివృద్ధిని కోట్లాది రుపాయలు ఖర్చు దాదాపు 90 శాతం మేర పూర్తి చేసి చూపెట్టిన ముఖ్యమంత్రి, నాయకుల గొప్పతనాన్ని ప్రజలు హర్షిస్తున్నారు.

'ఆడుదాం ఆంధ్రా' క్రికెట్ విజేత గుత్తి

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ ఫుట్‌బాల్ క్రీడామైదానంలో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నీలో గుత్తి సీపీఐ కాలనీ జట్టు విజేతగా నిలిచింది. శనివారం గుత్తి సీపీఐ కాలనీ–బసినేపల్లి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. స్థాయి క్రికెట్ విన్నర్స్(గుత్తి సీపీఐ కాలనీ) రన్నర్స్(బసినేపల్లి)కు మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు, ఎంపీపీ విశాలాక్షి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, సచివాలయ పట్టణ, మండల కన్వీనర్లు రంగస్వామి, సుభాష్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బిల్లు కలెక్టర్ చంద్ర, కౌన్సిలర్లు ఫరూక్, వాల్మీకి శివ, వరదరాజులు, నరేష్,కేవీ రమణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు షఫి, కటిక ఖురేషి అన్వర్, వెల్డింగ్ రవూఫ్, దాదా పీర్, నూర్ నాయక్, హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర, ప్రసాద్, సునీల్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

పుట్లూరు: మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో శనివారం వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. టీటీడీ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం చేపట్టనున్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, శింగనమల మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మూలి వెంకటరామిరెడ్డి భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి నింపేందుకే పోటీలు

తాడిపత్రి అర్బన్: క్రీడాస్ఫూర్తిని నింపేందుకే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు పట్టణంలో శనివారం రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో దోహపడుతాయన్నారు.

నాటుసారా పట్టివేత

పెద్దపప్పూరు: మండలంలోని పెద్దయక్కలూరులో శనివారం తెల్లవారుజామున వాహనాల తనిఖీలో భాగంగా పోలీసులు నాటుసారాను పట్టుకున్నారు. వివరాలు.. యాడికి మండలం పుప్పాలతండా గ్రామానికి చెందిన శ్రీరాములు నాయక్, హనుమంతు నాయక్ బైక్‌పై నాటుసారా తరలిస్తుండగా పట్టుకున్నారు. నిందితుల నుంచి 14 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శరత్‌చంద్ర పేర్కొన్నారు.